నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | నల్లగొండ, బుధవారం 23 ఏప్రిల్ 2025 | YADADRI BHUVANAGIRI

ఆత్మకూరు(ఎం) : బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, వేదికపై మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ తదితరులు

## ప్రతి గ్రామం నుంచి రజతోత్సవ సభకు తరలిరావాలి

- బీఆర్ఎస్ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి
- తెలంగాణ రాష్ట్రం కోసం కేసీఆర్ త్యాగం మరువలేనిది
- ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 22 : ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. ఆత్మకూర్.ఎస్ మండల కేంద్రంలో మంగళవారం జరిగిన బీఆర్ఎస్ మండల సన్నాహక సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తెలంగాణ కోసం పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అని, పార్టీ ఆవిర్భావం సందర్భంగా ప్రతి గ్రామంలో గులాబీ జెండాను ఎగురవేసి 27న జరిగే ఎల్కతుర్తి సభకు రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్యాగం మరువలేనిదని, ఆయన పదేండ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారని తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుంటే ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు వచ్చేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధమవుతున్నారన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ మంత్రులు అభివృద్ధి పనులు చేయకుండా పాలనను గాలికి వదిలేశారని తెలిపారు. అబద్ధాల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రానున్న రోజుల్లో ప్రజలు తరిమికొడుతారని అన్నారు.

ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, మాజీ మండలాధ్యక్షుడు బాష బోయిన ఉప్పలయ్య, సెక్రటరీ జనరల్ పంజాల వెంకటేశ్‌గౌడ్, నాయకులు యాస ఇంద్రారెడ్డి, కొరె భిక్షపతి, పూర్ణచందర్‌రాజు, యాస కవిత, ధనలక్ష్మి, అరుణ, శంతన్‌రాజు, రమేశ్, రంగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

మండలంలోని కూరెళ్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు నార్కట్‌పల్లి ప్రేమ్‌కుమార్ మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, వేదికపై మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

## చరిత్రలో నిలిచిపోయేలా బీఆర్ఎస్ రజతోత్సవ సభ

- కేసీఆర్ స్పీచ్ కోసం ప్రజలంతా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు
- ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భగత్

పెద్దవూర, ఏప్రిల్ 22 : ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. పెద్దవూర మండల కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. సభకు బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్నారని అన్నారు. సభలో కేసీఆర్ మాట్లాడే స్పీచ్ కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అతి తక్కువ సమయంలోనే ప్రజాదరణ కోల్పోయింని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో అభాసుపాలైందని తెలిపారు. కాంగ్రెస్ మాయమాటలకు మోసపోయిన ప్రజలు ఇప్పుడు గోసపడుతున్నారని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి సాధించిందని తెలిపారు. రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ నాయకత్వమే రక్ష అని ప్రజలు నమ్ముతున్నారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆప్కాబ్ మాజీ ఛైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి, గోనె విష్ణువర్ధన్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు జటావత్ రవినాయక్, మాజీ ఎంపీపీ సుందర్‌రెడ్డి, రమావత్ రవి నాయక్, మెండె సైదులు, నడ్డి లింగయ్య, పొదిల శ్రీను, కొట్టె బాలయ్య, నడ్డి బాలరాజుయాదవ్, కిషన్‌నాయక్, రవినాయక్, శ్రీకర్‌నాయక్ పాల్గొన్నారు.

## ఆన్‌లైన్‌లో విద్యార్థుల ప్రగతి పత్రాలు

- నేడు పాఠశాలల్లో కూడా అందజేయనున్న టీచర్స్
- రేపటి నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

రామగిరి, ఏప్రిల్ 22 : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను ఆన్‌లైన్‌లో అందించేలా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. 1 నుంచి 9వ తరగతి చదివిన విద్యార్థులకు బుధవారం వాటిని పాఠశాలల్లో ఆన్‌లైన్‌లో ప్రింట్ తీసి ఇవ్వనున్నారు. ఇప్పటికే ఎఫ్ఏ 1, 2, 3, 4 ఫలితాలతోపాటు ఎస్ఏ – 1 ఫలితాలను ఆన్‌లైన్ ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు నమోదు చేశారు. ఎఫ్ఏ 2 మూల్యాంకనాన్ని ఉపాధ్యాయులు ఏరోజుకారోజు పూర్తి చేశారు. మార్కులను ఐఎస్ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేశారు. గతంలో ప్రోగ్రెస్ కార్డులను విద్యాశాఖ సమగ్రశిక్ష నుంచి సరఫరా చేసేది. ప్రస్తుతం వాటి సరఫరా లేకపోవడంతో గత సంవత్సరం ఆన్‌లైన్‌లో ప్రగతి ప్రతాల పంపిణీకి చర్యలు చేపట్టారు. కానీ పూర్తి స్థాయిలో అమలు కాలేదు. ఈ ఏడాది పూర్తిగా అమలయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసిన ప్రగతి పత్రాలపై ప్రధానోపాధ్యాయులు సంతకం చేసి అందించాలని నల్లగొండ డీఈఓ బి.భిక్షపతి తెలిపారు. పాఠశాలలకు ఈ నెల 24నుంచి వేసవి సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. తిరిగి జూన్ 12 పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.

వరంగల్ ఎడ్ల బండ్ల యాత్రను ప్రారంభించి బండి నడుతుపున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

# కొండంత అభిమానం.. సాహసోపేతమైన యాత్ర

## రైతుల గుండెల్లో బీఆర్ఎస్, మాజీ సీఎం కేసీఆర్

- పదేండ్లలో కేసీఆర్ చేసిన అభివృద్ధిని మరిచిపోని జనం
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- వరంగల్‌లో రజతోత్సవ సభకు ఎడ్లబండ్లపై బయల్దేరిన రైతులు
- నెమ్మికల్‌లో దండు మైసమ్మకు పూజలు నిర్వహించి ప్రారంభించిన జగదీశ్‌రెడ్డి

రజతోత్సవ సభకు వెళ్తున్న ఎడ్లబండ్లకు మద్దిరాల మండల కేంద్రంలో స్వాగతం పలికిన మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

రజతోత్సవ సభకు ఎడ్లబండ్లపై తరలివెళ్తున్న రైతులు

ఆత్మకూర్.ఎస్, ఏప్రిల్ 22 : తెలంగాణ ఉద్యమ కాలం నుంచి పదేండ్ల పాలన వరకు బీఆర్ఎస్ పార్టీ చేసిన కార్యక్రమాలు, ఉద్యమ నేత, మాజీ సీఎం కేసీఆర్ అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు మేలు చేశాయని, ఆ అభిమానంతో ప్రజలు, రైతులు ఈ నెల 27న వరంగల్‌లో జరుగనున్న రజతోత్సవ సభకు ఎడ్లబండ్లపై సాహసోపేతమైన యాత్ర చేపట్టారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఎడ్లబండ్లపై పలువురు రైతులు వరంగల్ సభకు బయల్దేరగా ఆత్మకూర్.ఎస్ మండలం నెమ్మికల్ దండు మైసమ్మ ఆల యం వద్ద మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పూజలు నిర్వహించి యాత్రను ప్రారంభించారు. సుమారు 5 కిలోమీటర్లు ఎడ్ల బండిని నడిపిన జగదీశ్‌రెడ్డి అందరిలో ఉత్సాహాన్ని నింపారు. యాత్రకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సారథ్యంలో జరుగనున్న 25 ఏండ్ల బీఆర్ఎస్ పండుగకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరానున్నారని తెలిపారు. సూర్యాపేట నుంచి రైతులు ఎడ్లబండ్లతో తరలివెళ్లడం ఆనందంగా ఉందన్నారు. బండెనక బండి కట్టి 16బండ్లు కట్టి అన్న పాటను సూర్యాపేట రైతులు మళ్లీ గుర్తు చేస్తున్నారని చెప్పారు. రైతాంగంతోపాటు అన్ని రంగాల ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి తప్పు చేశామని తెలుసుకున్నారని అ న్నారు. నీడలో ఉన్న వాళ్లం ఎండనబడ్డామని బాధతో ఈ కాంగ్రెస్ ప్రభుత్వంపై కోపంగా ఉన్నారని చెప్పారు. దండగ అనుకున్న వ్యవసాయాన్ని పండుగలాగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని తెలిపారు. అటువంటి దేవుడు లాంటి కేసీఆర్‌ని వదులుకున్నామన్న బాధలో ప్రజలంతా ఉన్నారని, అందుకే కేసీఆర్ మీద అభిమానంతో బీఆర్ఎస్ రజతోత్సవ సభకు రైతాంగం ఎడ్లబండ్లపై బయల్దేరారని చెప్పారు. ప్రజలంతా హాజరై ఈ సభను కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేక సభలాగా నిర్వహించుకోవాలని భావిస్తున్నారని అన్నారు. గత పది రోజుల క్రితం రైతులు కలిసి ఎడ్ల బండ్లపై వెళ్దామంటే, 130 కిలో మీటర్ల మేర ఈ ఎండలో వెళ్లడం సాధ్యమైద్దా అన్నానని, 'కాంగ్రెస్ ప్రభుత్వం పెడుతున్న ఇబ్బందులను తట్టుకున్నోళ్లం.. ఈ ఎండలను తట్టుకోవడం లెక్క కాదు' అని రైతులు ధీమాగా చెప్పారని గుర్తు చేశారు. సభ సమయానికి చేరుకునేలా ముందుగా అనుకున్న ప్రకారం ఐదు రోజుల ముందుగా బయల్దేరారని తెలిపారు. కేసీఆర్‌పైన రైతాంగం చూపుతున్న అభిమానాన్ని చూస్తుంటే కాంగ్రెస్ పార్టీ మీద వారికి ఎంత వ్యతిరేకత ఉన్నదో అర్థమవుతుందని తెలిపారు.

## బీఆర్ఎస్ సభకు దండులా కదిలిరావాలి

- మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్న జనం
- భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 22 : వరంగల్‌లో ఈ నెల 27న జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు దండులా కదిలిరావాలని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం భువనగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, దీంతో రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్‌పై వ్యతిరేకత వచ్చిందని అన్నారు. పదేండ్ల పాలనతో దేశంలో రాష్ట్రాన్ని అదర్శంగా నిలిపిన ఘనత కేసీఆర్‌దేనని, మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. జిల్లా నాయకుడు కొలుపుల అమరేందర్, మండలాధ్యక్షుడు జనగాం పాండు, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి, మాజీ ఎంపీపీ అతికం లక్ష్మీనారాయణగౌడ్, మాజీ జడ్పీటీసీ బీరు మల్లయ్య, నాయకులు రమేశ్, మధుసూదన్‌రెడ్డి, వెంకట్, యశీల్, ర్యాకల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఎల్కతుర్తి సభకు పెద్ద ఎత్తున తరలిరావాలి

- బీఆర్ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయ కర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి

నేరేడుచర్ల, ఏప్రిల్ 22 : ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని హుజూర్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సమన్వయ కర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి అన్నారు. నేరేడుచర్లలో మంగళవారం చలో వరంగల్ వాల్ రైటింగ్‌ను రాసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, పదేండ్ల పాలనలో దేశంలోనే రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలిపిన ఘనత కేసీఆర్ దేనన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అరిబండి సురేశ్ బాబు, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి చిత్తలూరి సైదులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, మాజీ ఎంపీపీ చెన్నబోయిన సైదులు, మాజీ మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, ఉపాధ్యక్షుడు వస్కుల సుదర్శన్, మాజీ మండలాధ్యక్షుడు పంగ శ్రీను, బొడ్డుపల్లి సుందరయ్య, రాపోలు నవీన్, ఇంజమూరి రాజేశ్, పల్లెపంగు నాగరాజు, జెట్టి వెంకన్న, హుస్సేన్, కొణతం చిన్న లచ్చిరెడ్డి, వినాయకరావు, దొంపాటి భిక్షారెడ్డి, మర్రు శ్రీను, సైదులు, చిట్యాల శ్రీను, భరత్ పాల్గొన్నారు.

నేరేడుచర్లలో రజతోత్సవ సభ వాల్ రైటింగ్ రాస్తున్న ఒంటెద్దు నర్సింహా రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

## ఇంటర్ ఫలితాల్లో బాలికల హవా

### ఫస్టియర్‌లో నల్లగొండ జిల్లా 16, సెకండియర్‌లో 19వ స్థానం

### యాదాద్రి జిల్లా 14, సూర్యాపేట జిల్లా 31వ స్థానం

గుర్రంపోడులోని మోడల్ స్కూల్ విద్యార్థుల విజయకేతనం

రామగిరి/సూర్యాపేట అర్బన్/భువనగిరి అర్బన్, ఏప్రిల్ 22 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఫలితాల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బాలికల హవా కొనసాగింది. రాష్ట్రంలో సూర్యాపేట జిల్లా ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 31వ స్థానంలో నిలిచింది. జనరల్ విభాగంలో మొదటి సంవత్సరం 56.55, ద్వితీయ సంవత్సరంలో 67.18 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్‌లో ఫస్టియర్ 48.06, సెకండియర్ 62.23 శాతం మంది పాసయ్యారు. నల్లగొండ జిల్లా ప్రథమ సంవత్సరంలో 16, ద్వితీయ సంవత్సరంలో 19వ స్థానం దక్కించుకుంది. ఫస్టియర్‌లో 54.99, సెకండియర్‌లో 68.84శాతం మంది పాసయ్యారు. ప్రథమ ఒకేషనల్‌లో 50.37, ద్వితీయలో 69.63 శాతం ఉత్తీర్ణత సాధించారు. యాదాద్రి భువనగిరి జిల్లా ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో 14వ స్థానంలో నిలిచింది. ఫస్టియర్‌లో 58.54, సెకండియర్‌లో 62.96 శాతం మంది పాసయ్యారు.